# ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పగ్గాలు రమేష్ చేతికి

## మండల అధ్యక్షుడిగా పెసరు రమేష్ నియామకం



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 2 జర్నలిస్ట్(వార్త):** ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీకి కొత్త సారథిగా పెసరు రమేష్ ఎంపికయ్యారు. తాటికాయల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడైన ఆయనను మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.నియామకంపై స్పందించిన పెసరు రమేష్.. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రమేష్ స్పష్టం చేశారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు చేరవేస్తానన్నారు.అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని, అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పేదల గుండెల్లో చోటు సంపాదిస్తున్న యువనేత ప్రవీణ్

## జన్మదినాన సేవా బాట.. ఎర్రబానుపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**కల్లూరు/, జూలై 2 (జర్నలిస్ట్ వార్త):** కేక్ కట్ చేయడం, వేడుకలు నిర్వహించడానికే జన్మదినాన్ని పరిమితం చేయకుండా, సేవా కార్యక్రమాలతో గుర్తుండిపోయేలా జరుపుకున్నారు ఎర్రబానుపల్లికి చెందిన యువనేత ప్రవీణ్. శ్రీనివాసరావు తనయుడైన ప్రవీణ్ జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రబానుపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి పేద కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందించారు. శిబిరానికి హాజరైన గ్రామస్తులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్యం, విద్య వంటి మౌలిక అవసరాలు అందేలా దశలవారీగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. తన పరిధిలో ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సాధ్యమైనంత మేర సేవలందిస్తానని చెప్పారు.శిబిరంలో మోహన్ హాస్పిటల్ వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

# భూముల రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం.

## -తహసీల్దార్ నాగరాజు.





**బయ్యారం/,జులై 2.(జర్నలిస్ట్ వార్త)**భూముల రీ సర్వేతో బయ్యారం మండలంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా బయ్యారం మండలంలోని కొత్తపేట పంచాయతీ రైతు వేదికలో గురువారం సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సదస్సుకు తహసీల్దార్ నాగరాజు ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. రీసర్వేతో భూ రికార్డుల శుద్ధి జరిగి రైతులకు స్పష్టమైన హక్కులు కలుగుతాయన్నారు.రీ సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా అమలు చేస్తామని తహసీల్దార్ వెల్లడించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం నిర్వహించిన భూ సర్వే తర్వాత మళ్ళీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో చేపడుతున్న భూ రిసర్వేను విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సందీప్,ఏఈఓలు,జిపిఓ,గ్రామ ప్రజలు,రైతులు పాల్గొన్నారు.

## కొత్తపేట సబ్ స్టేషన్ లో విద్యుత్ వినియోగదారుల సదస్సు.

**బయ్యారం/,జులై 2.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలం కొత్తపేట సెక్షను. 33/11కేవి సబ్ స్టేషన్ కార్యాలయంలోని సబ్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పరచినట్లు టీజీ ఎన్పిడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్పర్సన్ తెలిపారు.ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ,కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లు మార్చటం,వోల్టేజి హెచ్చుతగ్గులు,డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల,లోపాలు ఉన్న మీటర్లు మార్చడం,నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకాన్ని హెచ్చు మొత్తంతో గల బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు మొదలగు వాటికి సంబంధించి విద్యుత్ వినియోగదారులు వ్రాతపూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చునని తెలిపారు.ఈ ఫిర్యాదులు ఉదయం గం.10.30 నుండి మధ్యాహ్నం గం.1.00 వరకు స్వీకరించబడునని అన్నారు.కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జి.నాగప్రసాద్ తెలిపారు.

# యూరియాపై ఆందోళన వద్దు!

## ఖమ్మం జిల్లాలో 3.81 లక్షల బస్తాల నిల్వలు

### అవసరమైన మేరకే కొనుగోలు చేయాలి: జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



**ఖమ్మం,/ జూలై 2 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య స్పష్టం చేశారు. వానాకాలం సాగు నేపథ్యంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.వానాకాలం2026 సీజన్‌కు జిల్లాకు తెలంగాణ ప్రభుత్వం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా, ప్రస్తుతం జిల్లాలో 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ గోదాములు, కంపెనీ గోదాములు, కమిషనర్ రిజర్వ్ పూల్‌లో తగిన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఇప్పటివరకు జిల్లాలో 56,926 మంది రైతులు యూరియా యాప్ ద్వారా 1,80,738 బస్తాలను బుక్ చేసుకోగా, 1,60,316 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు యూరియాను పొందుతున్నారని వివరించారు.యూరియా కొరతపై వస్తున్న ప్రచారాలను నమ్మవద్దని, అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దని రైతులకు సూచించారు. ప్రతి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య స్పష్టం చేశారు

# ఖమ్మం కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పనులపై విమర్శలు

## నాణ్యత, బిల్లుల చెల్లింపులపై విచారణకు డిమాండ్



**ఖమ్మం,/ జూలై 2( జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న కొన్ని అభివృద్ధి పనుల అమలు తీరుపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ కాంట్రాక్టర్‌కు వరుసగా పనులు కేటాయించడం, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపుల్లో పారదర్శకత లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, సదరు కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధులతో ఉన్న పరిచయాలను ప్రస్తావిస్తూ అధికారులపై ప్రభావం చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు.50, 59, 60 డివిజన్లలో చేపట్టిన కొన్ని రోడ్లు, డ్రైనేజీ పనుల్లో అవసరమైన ముందస్తు చర్యలు పూర్తికాకుండానే నిర్మాణాలు చేపట్టారని, పనుల నాణ్యతను సమగ్రంగా పరిశీలించకుండా ధ్రువీకరణలు జారీ చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కాంట్రాక్టు పనులను ఇతరులకు అప్పగించారనే ప్రచారం కూడా సాగుతోంది.బిల్లుల చెల్లింపుల విషయంలోనూ అసమానతలు ఉన్నాయని కొందరు స్థానిక కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. తమ బిల్లులు పెండింగ్‌లో ఉండగా, మరికొన్ని బిల్లులు వేగంగా క్లియర్ అయ్యాయంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఆరోపణల నేపథ్యంలో సంబంధిత పనుల నాణ్యత, కాంట్రాక్టుల కేటాయింపు, బిల్లుల చెల్లింపుల ప్రక్రియపై స్వతంత్ర సాంకేతిక విచారణ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కాగా, ఈ ఆరోపణలపై ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు లేదా సంబంధిత కాంట్రాక్టర్ స్పందన అందాల్సి ఉంది. స్పందన లభించిన వెంటనే ప్రచురిస్తామని తెలియజేస్తున్నాం.

# ఎరువుల ధరల పెంపు రైతుపై పెనుభారం

## నకిలీ విత్తనాల విక్రయదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి -ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం హెచ్చరిక



**ఎల్కతుర్తి, /జూలై 2 (జర్నలిస్ట్ వార్త):** వ్యవసాయానికి వెన్నెముకైన రైతుపై ఎరువుల ధరల పెంపు మరింత భారంగా మారిందని, వెంటనే ధరలను తగ్గించాలని తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎల్కతుర్తిలో మీడియాతో మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన వేళ యూరియా సహా ఎరువుల ధరలు పెరగడం, పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండటంతో సాగు వ్యయం అమాంతం పెరిగిందన్నారు. యూరియా పంపిణీలో అమలవుతున్న యాప్ విధానాన్ని రద్దు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు దుకాణాల్లోనే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేసి ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ప్రకటించిన బోనస్‌ను ఆలస్యం చేయకుండా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల విక్రయాలు పెరుగుతున్నాయని, రైతులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు, రసీదులు తీసుకోవాలని సూచించారు. నాణ్యతకు సంబంధించిన సమస్యలు తలెత్తితే అవే కీలక ఆధారాలుగా ఉపయోగ పడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టేముక్కుల మనోహర్‌రావు, మండల రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఇంజాల పోచయ్య, పిన్‌రెడ్డి మోహన్‌రెడ్డి, బోయినపల్లి స్వామిరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మాదిగలు ప్రథమ స్థానానికి చేరాలి

## బిర్రు మహేందర్ -అక్షరాస్యతతోనే వెనుకబాటుతనానికి విముక్తి

### భువనగిరిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అత్యవసర సమావేశం





**భువనగిరి/జూలై 2(జర్నలిస్ట్ వార్త):** తరతరాల వెనుకబాటుతనం నుంచి విముక్తి లభించాలంటే మాదిగ సామాజిక వర్గం విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా మార్చుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ టైగర్ బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన అత్యవసర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేందర్ మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పాటు సాగించిన అలుపెరగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. దీని ద్వారా దక్కే 9 శాతం రిజర్వేషన్లను యువత సంపూర్ణంగా ఉపయోగించుకుని విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో రాష్ట్రంలోనే అత్యధిక పేదరికం, నిరక్షరాస్యత, భూమి లేకపోవడం వంటి సమస్యలు మాదిగల్లోనే ఎక్కువగా ఉన్నట్లు తేలిందని గుర్తుచేశారు. ఈ దుస్థితి మారాలంటే చదువే ఏకైక మార్గమని, బడికి దూరమైన పిల్లలందరినీ తక్షణమే బడి బాట పట్టించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూలై 7న ప్రతి గ్రామంలో మాదిగల జెండా పండుగ'ను అంబరాన్నంటేలా నిర్వహించాలని కోరారు.

## అన్యాయాన్ని సహించం..

తెలంగాణలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డులో జిల్లా వాసులకు, అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు స్థానం కల్పించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కమిటీని పునఃసమీక్షించకపోతే ఆత్మగౌరవ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, దళిత ఐక్యవేదిక చైర్మన్ భట్టు రాంచంద్రయ్య, జాతీయ నేత బండారు రవివర్ధన్, మంద శంకర్, ఇటుకల దేవేందర్, శివశంకర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు బంద్ చేయాల్సిందే..!






**చట్టం ముందు ఎవరూ అతీతులు కారు: సర్పంచ్ మాచర్ల జ్యోతి**

**ధర్మసాగర్‌లో అక్రమ మద్యం విక్రయాలపై పంచాయతీ కొరడా**

**ఏకగ్రీవ తీర్మానం.. నిర్వాహకులకు నోటీసులు.. ఇక చర్యలే!**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 2 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై గ్రామపంచాయతీ ఉక్కుపాదం మోపింది. యువతను మద్యానికి బానిసలుగా మారుస్తూ, కుటుంబాల్లో కలహాలకు కారణమవుతున్న బెల్ట్ షాపులను ఇకపై సహించబోమని స్పష్టం చేస్తూ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. తీర్మానం అమలులో భాగంగా బెల్ట్ షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, వెంటనే దుకాణాలు మూసివేయాలని ఆదేశించింది.

మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతితో వైన్ షాప్ ఉన్నప్పటికీ, గ్రామంలోని పలు కాలనీల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు సాగుతున్నాయని సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ వ్యాపారం కారణంగా యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతుండగా, పేద కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. గ్రామపంచాయతీ జారీ చేసిన నోటీసులు అందుకున్న నిర్వాహకులు స్వచ్ఛందంగా బెల్ట్ షాపులు మూసివేయాలని, లేనిపక్షంలో పోలీసు, ఎక్సైజ్ శాఖల సహకారంతో చట్టపరమైన చర్యలు తప్పవని పాలకవర్గం హెచ్చరించింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి మాట్లాడుతూ.. "ధర్మసాగర్‌లో అక్రమ మద్యం విక్రయాలకు ఇకపై తావులేదు. బెల్ట్ షాపులు బంద్ చేయాల్సిందే. చట్టం ముందు ఎవరూ అతీతులు కారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తాం. గ్రామ యువత భవిష్యత్తు, మహిళల భద్రత,



కుటుంబాల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యం" అని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ నిర్ణయాన్ని గ్రామస్తులు స్వాగతించారు. అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట పడితే గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని, యువత చెడు వ్యసనాలకు దూరమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు కొంత కొమురమ్మ, మేకల సంబరాలు, మమతా రెడ్డి, జనగాని సుమన్, కళ్యాణి, ప్రేమ్ కుమార్, బొడ్డు రఘు, గంగారపు శ్యామ్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలపై ఆక్రమణలకు చెక్

**రేకుల షెడ్లు, బోర్డులు మూడు రోజుల్లో తొలగించాలి**

**లేకుంటే పంచాయతీయే రంగంలోకి.. కార్యదర్శి ప్రవీణ్ కుమార్ హెచ్చరిక**




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 2 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రధాన రహదారుల వెంట డ్రైనేజీలపై నిర్మించిన రేకుల షెడ్లు, ఏర్పాటు చేసిన ప్రచార బోర్డులపై గ్రామపంచాయతీ కొరడా ఝుళిపించింది. మూడు రోజుల్లోగా వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో గ్రామపంచాయతీయే తొలగింపు చర్యలు చేపడుతుందని కార్యదర్శి ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ధర్మసాగర్ మండల కేంద్రం కావడంతో నిత్యం పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. అయితే డ్రైనేజీలపై రేకుల షెడ్లు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల రహదారులు ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆక్రమణదారులు మూడు రోజుల్లో స్వచ్ఛందంగా షెడ్లు, బోర్డులు తొలగించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత కూడా తొలగించకుంటే గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రత్యేకంగా తొలగింపు కార్యక్రమం చేపట్టి, నిబంధనల ప్రకారం అయ్యే ఖర్చును సంబంధిత వారినుంచే వసూలు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి, ట్రాఫిక్ సౌలభ్యం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కోరారు

# వర్ధన్నపేటలో ఘనంగా విత్తన మేళా

**పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సారంగపాణి**






**వర్ధన్నపేట/ జూలై 2(జర్నలిస్ట్ వార్త);**స్థానిక రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్యఅతిథిగా హాజరై, రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను అందించి, అధిక దిగుబడులతో వారి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా, కేవలం గుర్తింపు పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, అందుబాటులో ఉన్న సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శిభారాణి, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, ఏఈఓ మౌనిక, కౌన్సిలర్లు పాపరావు, కమిలి, కాంగ్రెస్ నాయకులు వెంకన్న, కుమారస్వామి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి.

**బయ్యారం/,జులై 2.(జర్నలిస్ట్ వార్త)**

విద్యావ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఉపాధ్యాయుల వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుకారేల కనిపిస్తుంది. ఇలాంటిదే ఒకటి బయ్యారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బయ్యారం మండలంలోని నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలో రెండేర్ల గడ్డ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ నాయక్ సమయపాలన పాటించడం లేదు. సర్పంచ్ సొలం బాలకృష్ణ పాఠశాలను సందర్శించి హెచ్‌ఎంను పాఠశాలకు ఎందుకు లేటుగా వస్తున్నారని ప్రశ్నించగా మీరు ఎవరు నన్ను అడగడానికి అని సర్పంచ్ పై వాగ్వాదానికి దిగాడు.. సర్పంచ్ అయితే ఏంటి నీకు సమాధానం చెప్పాలా, ఏమి చేసుకుంటావో చేసుకో అని నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సర్పంచ్ బాలకృష్ణ తెలిపారు. ప్రతిరోజు 10 గంటలైన పాఠశాలకు రాని




హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలన్నారు.

**హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి.**

**పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.గణేష్.**

రెండేర్ల గడ్డ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మణ్ నాయక్ సమయపాలన పాటించడం లేదని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండి ఎవరికి చెప్పుకుంటారో చెప్పండి అనే రీతిలో హెచ్‌ఎం మాట్లాడుతున్నారని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంఈఓ, డిఈఓ పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని అతనిపై కఠినమైన చర్యలు తీసుకోని నిత్యం విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.




# సవాల్ విసిరి తోక ముడిచిన జూపల్లి...

**-బానోత్ హరిప్రియ నాయక్...**



**బయ్యారం/,జులై 2.(జర్నలిస్ట్ వార్త)**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల భారంపై చర్చకు రావాలంటే మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాలును స్వీకరించిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలంగాణ భవన్ లో మంత్రి జూపల్లి కృష్ణారావుతో చర్చ నిమిత్తం కుర్చీని సన్మానించడానికి శాలువాని సిద్ధంగా చేసి ఎదురుచూస్తూ ఉండగా చివరి నిమిషంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తాను చర్చలకి గన్ పార్కు వద్ద సిద్ధంగా ఉన్నానంటూ ప్రకటించగా సరే అక్కడికి వెళ్తున్న హరీష్ రావుని తెలంగాణ పోలీసులు టార్గెట్ చేసి బిఆర్ఎస్ శ్రేణులను ముందుకు కదలనివ్వకుండా తెలంగాణ భవన్ వెలుపల భారీగా పోలీసులు మోహరించి హరీష్ రావుని అరెస్టు చేయడం పట్ల ఇల్లందు మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బానోత్.హరిప్రియ నాయక్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దనెక్కినప్పటి నుండి కూడా పోలీసులతో ప్రభుత్వాన్ని నడిపిస్తుంది తప్ప మంత్రులతోని ఎమ్మెల్యేలతోని కాదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులను పెట్టి నిలువరించాలని చూస్తే ప్రజల ముందు నిజాలు బయటపెట్టే వరకు మా పోరాటం ఆగదు అని హరిప్రియ హెచ్చరించారు.

# మధ్యతరగతిపై ఫీజు ల సునామీ..

## అక్షరజ్ఞానం కోసం సామాన్యుడి అగ్నిపరీక్ష



పట్టణాల్లో ఇండ్ల కిరాయిలు పెరిగితేనో, నిత్యావసరాల ధరలు మండితేనో సర్దుకుపోయే సగటు మధ్యతరగతి కుటుంబం. పిల్లల చదువుల దగ్గరకు వచ్చేసరికి మాత్రం నిలువునా నిలువుదోపిడీకి గురవుతోంది. నాణ్యమైన విద్యనందించి తమ పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేయాలనే ఆరాటంతో పల్లెల నుంచి పట్టణాలు, జిల్లా కేంద్రాలకు వలస వస్తున్న పేద, సామాన్య కుటుంబాలకు అక్షరాలా ఫీజుల వాత తప్పడం లేదు. తాజా విద్యాసంవత్సరంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు క్లాసుల వారీగా ఏకంగా రూ. 5000 వరకు ఫీజులను పెంచేయడం గమనార్హం. దీనికి తోడు బడికి దగ్గరగా ఉందామనుకుంటే చుట్టుపక్కల రూముల కిరాయిలు కూడా ఆకాశాన్నింటుతున్నాయి. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యాసంస్థల యాజమాన్యాలు, గృహయజమానులు చేస్తున్న ఈ సంయుక్త దోపిడీ సామాన్యుల నడ్డి విరుస్తోంది.

### కార్పొరేట్ మోజు వలసల వెనుక అసలు వేదన

ప్రభుత్వ విద్యావ్యవస్థపై నమ్మకం సడలడం, కార్పొరేట్ చదువుల పట్ల సమాజంలో పెరిగిన మితిమీరిన మోజు విద్యా రంగంలో ఒక కృత్రిమ డిమాండ్‌ను సృష్టించాయి. ఈ బలహీనతను విద్యాసంస్థలు అంగడి సరుకుగా మార్చుకున్నాయి. తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువులు, ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులు ఇప్పిస్తేనే భవిష్యత్తు ఉంటుందనే ఆశతో రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు సైతం జిల్లా కేంద్రాల వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే అక్కడికి వెళ్లాక వారికి ఎదురవుతున్న పరిస్థితులు నరకప్రాయంగా మారుతున్నాయి. కేవలం స్కూల్ ఫీజులే కాకుండా, రవాణా ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో అదనపు బాదుడు తప్పడం లేదు.

### డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటున్న వ్యాపారీకరణ

ఈ డిమాండ్‌ను విద్యాసంస్థల యాజమాన్యాలు ఏమాత్రం సేవాభావంతో కాకుండా పక్కా వ్యాపార కోణంలో క్యాష్ చేసుకుంటున్నాయి. ఏటా ఎలాంటి ముందస్తు నోటీసులు, నియంత్రణ లేకుండా ఫీజులు పెంచేస్తూ పోతుంటే, పిల్లలను చదివించడం కోసం తల్లిదండ్రులు తమ రెక్కల కష్టాన్ని ధారబోస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అటు బడి ఫీజులు, ఇటు హాస్టల్ లేదా రూముల అద్దెలు భరించలేక వలస వచ్చిన ఎన్నో కుటుంబాలు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నాయి. విద్య అనేది ప్రాథమిక హక్కు కాకుండా, కేవలం సంపన్నులకే పరిమితమయ్యే విలాసంగా మారిపోతున్న వైనం ఆందోళనకరం. చుట్టుపక్కల ఉన్న గృహ యజమానులు సైతం బడుల రీ-ఓపెనింగ్ సీజన్‌ను బట్టి కిరాయిలు పెంచడం వారి దోపిడీ బుద్ధికి అద్దం పడుతోంది.

### చట్టాలు ఉన్నాయి.. అమలు ఏది?

ఫీజుల నియంత్రణ చట్టాలు, జీవోలు కాగితాలకే పరిమితం కావడం వల్లే ప్రైవేట్ యాజమాన్యాలు ఇంతలా చెలరేగిపోతున్నాయి. ప్రభుత్వాలు తూతూమంత్రంగా కమిటీలను వేయడం తప్ప, క్షేత్రస్థాయిలో సామాన్యుడికి ఉపశమనం కలిగించేలా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ప్రైవేట్ స్కూళ్లలో ప్రతి ఖర్చునూ ఆడిట్ చేయాలన్న నిబంధనలు ఉన్నా, వాటిని పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఫీజుల మోతాదును, పాఠశాలల పరిసరాల్లో అద్దెల దోపిడీని అరికట్టేలా స్థానిక మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### దిద్దుబాటు చర్యలు అత్యవసరం

కేవలం ఫీజుల నియంత్రణే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను కార్పొరేట్ స్థాయికి పెంచినప్పుడే ఈ వలసలు, ఈ దోపిడీలు పూర్తిగా ఆగుతాయి. విద్యా వ్యవస్థను లాభాపేక్ష కలిగిన వ్యాపార కోణం నుంచి తప్పించి, సగటు పౌరుడికి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం తక్షణమే హైపవర్ కమిటీలతో జోక్యం చేసుకోవాలి. ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే సంస్థల గుర్తింపు రద్దు చేసేలా కఠిన చట్టాలు తేవాలి. లేనిపక్షంలో అక్షరజ్ఞానం లేని సమాజం కాదు, ఆర్థిక స్థోమత లేక చదువుకు దూరమైన నిస్సహాయ తరమే రేపటి భవిష్యత్తుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి సామాన్యుడి చదువుల భారాన్ని తగ్గించేలా గట్టి చర్యలు తీసుకోవాలని సామాన్యులు డిమాండ్ చేస్తోంది



**సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్**
**సెల్ నంబర్ 9701249103**

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.

**-సర్పంచ్ సొలం బాలకృష్ణ.**



**బయ్యారం/,జులై 2.(జర్నలిస్ట్ వార్త)**గ్రామ శుభ్రత మన బాధ్యతగా తీసుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచుతు ఆరోగ్యమైన జీవితంలో ఆనందంగా జీవిద్దామని నారాయణపురం గ్రామ సర్పంచ్ సొలం బాలకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామ ప్రజలు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో వీధులు, రోడ్లు శుభ్రంగా ఉండాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతూ డోజరుతో రోడ్లపై ఉన్న చెత్తచెదారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది వంశీ, స్థానికులు హరీష్, బాలయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

